కా॥ టి.ఎన్. శతజయంతి సంవత్సరం

# కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి విప్లవతత్వం ఆదర్శం కావాలి

విశ్వం



**కామ్రేడ్** తరిమెల నాగిరెడ్డిని నేను మొదటిసారి 1966 ఏలూరులో జరిగిన యువజన సంఘం మహాసభల సందర్భంగా చూశాను. ఈ సందర్భంలో ఒకరాత్రి జరిగిన యువజన, విద్యార్థుల కోర్ సమావేశానికి ఆయన ప్రత్యేకంగా వచ్చారు. సామ్రాజ్యవాదం గురించి, గ్రామీణ ప్రజల దుస్థితి గురించి, వారిపై జరుగుతున్న దమనకాండ గురించి, సంక్షోభం యొక్క ప్రభావం గురించి, విద్యార్థిరంగ సమస్యల గురించి, విద్యార్థి ఉద్యమ నిర్మాణం ఎలా చేయాలి అన్న అంశాలపై మాట్లాడి వెళ్లిపోయారు.

మరోసారి పాలకొల్లు ప్లీనంలో చూశాను. కామ్రేడ్ బసవపున్నయ్య కేంద్రకమిటీ డాక్యుమెంట్లను వివరించగా కామ్రేడ్ చండ్ర పుల్లారెడ్డి, కొల్లా వెంకయ్య గారలు తమ తమ డాక్యుమెంట్లు వివరించారు. అంతిమంగా కేంద్ర కమిటీ డాక్యుమెంటుని తిరస్కరిస్తూ కామ్రేడ్ నాగిరెడ్డి తీర్మానాన్ని ప్రతిపాదించారు. అది అత్యధిక మెజారిటీతో నెగ్గింది. సి.పి.యం. నాయకత్వం రాష్ట్రకమిటీలో మెజారిటీ కోల్పోయి మరికొందరిని కో–ఆప్టు చేసుకొని మెజారిటీ తెచ్చుకొని నాగిరెడ్డి, డి.వి. తదితరులను పార్టీ నుంచి తొలగించింది. కామ్రేడ్స్ డి.వి., నాగిరెడ్డి, వెంకయ్య, పుల్లారెడ్డిలు 'పార్టీ సభ్యులకు లేఖ' ద్వారా తిరుగుబాటుని ప్రకటించారు. రాష్ట్రస్థాయి పార్టీ కేడర్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్టు రివల్యూషనరీస్ పేరుతో కమిటీని ఏర్పాటుచేశారు. ఆ కమిటీకి కామ్రేడ్ నాగిరెడ్డి కన్వీనర్.

ఆ కామ్రేడ్స్ నలుగురూ కలసి "పోరాట ఉద్యమానికి పునాదులేయండి" "తక్షణ కార్యక్రమం" అన్న డాక్యుమెంట్లను రూపొందించి విప్లవోద్యమ నిర్మాణానికి, విప్లవ పార్టీ నిర్మాణానికి చర్యలు మొదలుపెట్టారు.

1969లో అట్లప్రగడ(కృష్ణాజిల్లా)లో రాష్ట్రప్లీనం జరిపి, పై డాక్యుమెంట్లతో పాటు, శ్రీకాకుళ గిరిజన ఉద్యమంపై ఒక నోట్‌ని, ఉద్యమ కార్యకలాపాల రిపోర్టుని ప్లీనం డాక్యుమెంట్లుగా చేపట్టారు. ఈ కాన్ఫరెన్సు నాటికి కామ్రేడ్ కొల్లా వెంకయ్య తన వైఖరులను మార్చుకొని ఏది ఏమైనా శ్రీకాకుళం ఉద్యమాన్ని బలపర్చడమే తన మొదటి కర్తవ్యమని ఆ కమిటీతో చేరిపోయారు.

ఈ ప్లీనంలో ప్రత్యేక తెలంగాణ ఆందోళనపై కామ్రేడ్ నాగిరెడ్డి ప్రవేశ పెట్టిన తీర్మానం వర్గ దృక్పథంతో కూడినదిగా వుంది. పాలకవర్గాలు తమ మధ్య వైరుధ్యాల మూలంగా ఇలాంటి ఉద్యమాలు తీసుకువస్తున్నారని, ప్రజలు తమ మౌలిక సమస్యలపై పోరాటాల నుండి వైదొలగవద్దని ఆ తీర్మానం సారాంశం. ప్రజలు, విద్యార్థులు బహుళ సంఖ్యలో పాల్గొంటున్నారు కాబట్టి పై వైఖరికి జోడింపుగా దానికి సంఘీభావం తెలుపు తున్నారన్న మాటను చేర్పించారు. అంతసేపు జరిగిన చర్చ, దాని అవగాహన ఈ చిన్న వాక్యం జోడింపుతో ఎగిరిపోయింది.

ఏది ఏమైనా శ్రీకాకుళ ఉద్యమాన్ని, అప్పటికే దారి తప్పిన కార్యక్రమాలను బలపరచాలనే వాదనలు, డాక్యుమెంట్ల అవగాహనను గందరగోళంలోకి లాగడానికి ఉపయోగపెట్టబడ్డాయి. శ్రీకాకుళం పేరు పెకింగ్ రేడియోలో వస్తున్నది అనే ఆర్గ్యుమెంటుకి, నెల రోజుల్లో వరంగల్ గూడ పెకింగ్ రేడియోలో మారుమ్రోగుతుందన్న సవాళ్లు వచ్చినయ్.

పార్టీ అప్పటికప్పుడే రహస్యంలోకి వెళ్లాలనే వాదన, జిల్లాకమిటీ సభ్యులందరూ రహస్య జీవితం గడపాలని నిర్ణయం జరిగింది. ప్లీనం డాక్యుమెంట్లు ఆమోదించబడుతూనే ఈ గందరగోళాలన్నీ ఆ ప్లీనంలో వ్యక్తమయ్యాయి. డాక్యుమెంట్ల అవగాహన ప్రకారం కార్యకలాపాలు నిర్వహిద్దామని కొంతమంది, యాంత్రికంగా తమ ఎజెండా ప్రకారమే చేసుకొందామని మరికొంత మంది వ్యవహరించారు.

"తక్షణ కార్యక్రమమే" పరిస్థితిని అతిగా అంచనా వేసి తొలకరి నాటికి రైతాంగాన్ని సాయుధపోరాటానికి ఆయత్తపరచమని పేర్కొంది కాబట్టి, అసలు తప్పు దానిదే కనుక మిగిలిన పెడధోరణులన్నిటినీ సమర్థించే ప్రయత్నాలు చేయబడ్డాయి.

నేను అప్పటికే నాలుగు నెలల నుండి తూర్పు గోదావరిలో పనిచేస్తున్నాను. నేను బాధ్యత వహించే ప్రాంతంలో ప్రజా ఉద్యమం రూపు తొడుగుకుంటున్న రిపోర్టు ప్లీనం ముందు వుంది. కామ్రేడ్ నాగిరెడ్డి దీనిని పట్టించుకున్నాడా లేదా అన్నట్లు

కనబడుతూ కొండమొదలకు కావలసిన రక్షణ చర్యలు తీసుకొన్నారు. ప్రజా ఉద్యమం ఉన్నతస్థాయికి చేరుతుందన్న అంచనాతో రాయలసీమ నుండి ఒక కామ్రేడ్‌ని మాకు శిక్షణ నివ్వడానికి పంపించాడు. కామ్రేడ్ డి.వి. ప్లీనం తర్వాత గోదావరి ఏజన్సీ కేడర్ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రప్లీనం తర్వాత మరింత నిర్దిష్ట రూపం తీసుకొంటున్నది. జిల్లా కమిటీకి ఆ స్థాయిలో నాయకత్వం వహించడం గురించి ఆయనకు నమ్మకం కుదిరినట్లు లేదు. నన్ను కొంచెం దూరంగా పిలిచి, దుర్మార్గులైన భూస్వాములను అవసరమయితే నాలుగు పీకండని సలహాయిచ్చారు. నేనెందుకు యివన్నీ గుర్తు చేస్తున్నానంటే మార్క్సిజాన్ని ఆచరణకు అన్వయించడం, ప్రజల పోరాట శక్తిని క్రమక్రమంగా పెంచడమన్న అవగాహనతో పై నాయకులిద్దరి (నాగిరెడ్డి, డి.వి) సలహాలు, చర్యలూ ఉన్నాయి. కానీ ఆంధ్ర కమిటీలోని వారే కొంతమంది బాధ్యతారహితమైన విమర్శలకు పూనుకొన్నారు. కొంతమంది ప్రధానమైన, మౌలికమైన విషయాలకు బదులు రెండవస్థాయి విషయాలపై యాగీ చేశారు. కామ్రేడ్ నాగిరెడ్డి ఈ సమస్యల మొత్తాన్ని సమగ్రంగా ఆలోచించాడు. దానికి తగినట్లు వ్యవహరిందానికి కృషి చేశాడు. ప్రజాపంథా రూపకర్తలు, సాయుధ ఆత్మరక్షణా కారులది అంతిమంగా ఒకే విధానమయింది. దీన్ని ధ్రువపరచే రివ్యూలు వున్నాయి.

కామ్రేడ్ నాగిరెడ్డి చిత్తశుద్ధి, వ్యక్తిత్వం ప్రశ్నార్థకంలో పడవేయడానికి చేసిన ప్రయత్నాలనన్నీ నాగిరెడ్డి గమనంలో ఉంచుకొంటూనే, ఒక బాధ్యతాయుత నాయకుడిగా ఎన్నో భారాలను భుజానకెత్తుకున్నాడు. కానీ యింట్లో కూర్చోలేదు.ఒకవైపున పాలకులు చేస్తున్న దాడులు, దుర్మార్గమైన ప్రచారాలను సవాల్ చేసి నిలబడటం, మరోవైపున విప్లవ ప్రజాపంథాను రక్షించుకోవటం, వివరించుకోవడం, స్వంతం చేసుకోవటం ఆచరణలో పెట్టడంలాంటి చర్యలన్నీ కా॥ నాగిరెడ్డి తదితర కామ్రేడ్స్ అదే కాలంలో నిర్వహించాల్సి వచ్చింది. ప్రత్యేకంగా కా॥నాగిరెడ్డి ఒకశక్తిగా మేరునగ గంభీరతతో నిలబడి అన్నివైపుల నుండి ఎదురైన సవాళ్ళను ఎదుర్కొన్నాడు. జయప్రకాశ్ ఉద్యమకారులతో చర్చించి వారి ఆందోళనా కార్యక్రమంలో భూమి సమస్యను చేర్చితే తప్ప, ఈ ఉద్యమం మూలంగా పెద్ద లాభంలేదని వాదించాడు. వాళ్లు దానిని అంగీకరించలేదు. ఐతే మేము మీ ఉద్యమం పట్ల సానుభూతితో ఉండగలమేగాని భాగస్వాములం కాలేమన్నాడు.

శ్రీకాకుళం గిరిజనులు వందలాది మంది జైలులో వుండగా, అడవుల్లో వున్న కుటుంబాలు కేంద్రీకరణ క్యాంపుల్లో పోలీసుల కనుసన్నల్లో స్వేచ్ఛలేని జీవులుగా బ్రతుకుతున్న స్థితిని ఆ ఏజన్సీకి వెళ్లి ఎదుర్కొన్నాడు. సాపేక్షంగా ప్రజలకు గాలిపీల్చుకునే అవకాశం కేవలం నాగిరెడ్డి పర్యటన, ఆయన గద్దింపు ఉపన్యాసాల మూలంగానే దొరికింది. కేసుల డిఫెన్సుకి లాయర్లు, దానికి ఆర్థికం కోసం క్యాంపెయిన్‌లు, పౌర, ప్రజాస్వామ్య హక్కుల కోసం ఆందోళనలు, విప్లవకారుల ఐక్యత కోసం పర్యటనలు, జిల్లాస్థాయి కమిటీలకు గైడెన్స్, సాంస్కృతిక, ఉపాధ్యాయ రంగాలలోని పెడధోరణులను సరిదిద్దడానికి సంఘర్షణ, జనశక్తి పత్రిక నిర్వహణ, గిరిజన ప్రాంతాల ఉద్యమ పునర్నిర్మాణం మొదలగు ఎన్నో బాధ్యతలను ఆయన మీదవేసుకొన్నాడు. పార్టీ కమిటీ నిర్ణయాలలో పాత్ర తీసుకొనడమేకాదు, అమలు జరపడానికి పడే తపన, ఆవేదనలకు, 1972 నుండి 1976లో ఆయన అమరుడయ్యే వరకు నేనొక ప్రత్యక్ష సాక్షిని. పార్టీ ఆర్థికం కోసం ఆర్థిక దాడుల ప్రస్తావనలు నిరాకరిస్తూ సానుభూతిపరులపై, ప్రజలపై ఆధారపడే పద్ధతిని నెలకొల్పడానికి ఆయన స్వయంగా పూనుకొని, తోటివారికి నేర్పాడు. ఉద్యమ పునర్నిర్మాణ నిర్ణయం అయిన వెంటనే తన నిర్మాణం కింద ఉన్న మెరుగైన కామ్రేడ్‌ని 1975లో తూర్పుగోదావరికి కేటాయించాడు. ఆ కామ్రేడ్ రామిరెడ్డిని నిజంగా ఆ రోజులలో అనంతపురం నుండి పంపించడం వలన ఆయన చాలా సౌలభ్యాలను వదులుకున్నాడు. రాయలసీమ జిల్లాలో పార్టీ నిర్మాణం కంటే ఏజన్సీ ప్రాంత ఉద్యమానికి ప్రాధాన్యమిచ్చాడు. ఉద్యమ నిర్మాణానికి ప్రథమ పీటవేసిన నాగిరెడ్డి చర్యలలో ఇది గమనించవలసిన విషయం. కొంతమంది నాయకులు తమ సౌలభ్యం కోసమే ఉద్యమం పేరుతో కేడర్‌ని కాజేశారని నా అనుభవంలో తేలింది. చిత్తశుద్ధి, నిబద్ధతలేని నాయకులు కామ్రేడ్ నాగిరెడ్డి శ్రమను కొల్లగొట్టారనడానికి, ఆయనకు కావలసిన సౌలభ్యాలను వమ్ము చేశారనడానికి నేను వెనుకాడటం లేదు. అయితే నాగిరెడ్డి అమాయక చక్రవర్తి కాదు. అన్నీ గమనంలో పెట్టుకొన్న స్ఫురద్రూపి. కీలకమైన కర్తవ్యాల నుంచి చిన్న కర్తవ్యాల వరకు ఆయన నిర్వహించాడు. మేలైన పనుల నెంచుకొని చిన్న పనులను, అల్పమైన పనులను చేయ నిరాకరించే కార్యకర్తలుంటారని కామ్రేడ్ స్టాలిన్ పేర్కొన్నాడు. కామ్రేడ్ నాగిరెడ్డి స్టాలిన్ సూచననే గాక తాను పుట్టిన భూమిక, పెరిగిన అత్యంత సౌకర్యవంతమైన జీవితాన్ని, దాని అలవాట్లన్నిటినీ వదులుకొనడానికి ఎంత శక్తివంతమైన ప్రయత్నం చేశాడో అర్థం చేసుకోవచ్చు

**సికింద్రాబాద్‌లోని ముషీరాబాద్ జైలులో...**

1969 ఏప్రిల్ అట్లప్రగడ సదస్సు డాక్యుమెంటు అయిన 'తక్షణ కార్యక్రమాన్ని' కుట్రకేసుకి ప్రభుత్వం ప్రాతిపదికగా చేసుకున్న తర్వాత దానిని స్వంతం చేసుకోవటం టి.ఎన్. రాజకీయ, నైతిక బాధ్యతగా స్వీకరించాడు. దానికనుగుణంగా జరిగిన ఆచరణ మొత్తాన్ని స్వంతం చేసుకోవడం జరిగింది. అదే సందర్భంలో దానికి భిన్నమైన ఆచరణను అతివాద, అవకాశవాద రాజకీయాలను శత్రువుముందు విమర్శించి, ఎండగట్టలేదు. ఈ సమస్యలన్నీ విప్లవకారుల అంతరంగిక సమస్యలుగా పరిగణించాడు. కా॥ నాగిరెడ్డి యొక్క హుందాతనంతో కూడిన ఈ వైఖరిని కొంతమంది చులకనగా తీసుకున్నారు.

కామ్రేడ్ నాగిరెడ్డి ఈరకపు ప్రచారాలను లక్ష్య పెట్టలేదు. పైగా కొన్ని సందర్భాలలో సమయానికి తగిన చర్యలు తీసుకోలేకపోయినందున వారికీ అవకాశ మేర్పడిందనీ, వారే క్రమంలో అర్థం చేసుకుంటారనీ చాలా హుందాగా మాట్లాడేవారు. విప్లవకారులందరూ ఐక్యం కావాలన్న ఆకాంక్షే ఆయన ఈ వైఖరి తీసుకోవటంలో వ్యక్తమవుతున్నది.

కామ్రేడ్ నాగిరెడ్డి జైలులో మేయర్‌గా వుండేవారు. ఆయన కామ్రేడ్స్ అందరి సమస్యలను పట్టించుకోవాలి. క్రమశిక్షణను మెయింటెన్ చేయించాలి. శత్రువుకి ఎవరైనా లోబడుతున్నారా అన్న పరిశీలనలో వుండాలి. కాలాన్ని వృధా చేయకుండా అందరూ అధ్యయనంలో ఉన్నారా అని పరిశీలించాలి; గొడవలు పడుతున్నారా అని గమనించాలి. జైలు అధికారులతో ఆయన మాత్రమే వ్యవహరించాలి.

నేను ఆ జైలులో అడుగుపెట్టిన వెంటనే తెలిసిన విషయం ఏమిటంటే కొంతమంది క్రమశిక్షణా రహితంగాను, శత్రువు కుట్రలకు దోహదపడుతూ ఉన్న వారిని, వేరే బ్లాక్‌లోకి పంపించారని తెలిసింది.

అలాగే చిల్లర మల్లర తగాదాలు పెట్టుకొంటూ గొడవలు జరుగుతున్నందున కామ్రేడ్ నాగిరెడ్డి ఆయన ఉంటున్న సింగిల్ రూమ్‌ని డి.వి. కిచ్చి పెద్ద బ్లాక్‌లోకి, ఈ అల్లరిచేసే వాళ్ల మధ్యకొచ్చాడని తెలిసింది.

పూలమొక్కలు పెంచడం ఆకు కూరలు పెంచడం పని ప్రతినిత్యం చేస్తూ వుండేవాడు. లాకప్ చేసిన తర్వాత సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9.30, 10 గంటల వరకు చదువుకొని ఆ బ్లాక్‌లో పేకాట ఆడుతుండేవారితో నాకూ ముక్కలేయండని అడిగి అరగంటసేపు ఆడి మళ్లీ తన పనిలో నిమగ్నమై రాత్రి రెండు, మూడు గంటల వరకు అధ్యయనంలో వుండేవాడు. ఉదయం 7 గంటలకు లేచి, కాఫీ తాగి మొక్కల పని చూసుకొని, బట్టలుతుక్కోవడం, పనులు చూచుకొని స్నానం చేసేవాడు. జైలులో బట్టలుతకడానికి మనిషినిచ్చే సౌకర్యమున్నా ఆయన దానినుపయోగించుకోలేదు. చేతితో మడతలు వేసుకొని దిండుకింద పెట్టుకొని భలే ప్రెస్ అయినయ్యనుకుంటూ ధరించేవాడు. పిల్లల కోసం సబ్ జైలర్ క్రిష్టఫర్ పిల్లల్ని అప్పుడప్పుడూ తెప్పించుకునేవాడు. క్రిష్టఫర్ భార్య క్రిష్టఫర్ మీద నాగిరెడ్డిగారికి చెప్పుకుని మందలింప చేయించేది. కామ్రేడ్ మండే పిచ్చయ్య ఆయన మంచం ప్రక్కన, ఎదురుగా సోమాచారి, సోమాచారి పక్కన నేను వుండేవారం. పిచ్చయ్యగారికి తాను పోగు చేసిన కొంత సమాచారమిచ్చి ఏదైనా వ్రాయమని ప్రోత్సహించేవాడు. పిచ్చయ్యగారు “భారతదేశంలో పరిశ్రమలు” అన్న పుస్తకం రాశాడు.

సోమాచారిగారికి సులభతరమైన ఇంగ్లీషు నవలలిచ్చి చదవమని ప్రోత్సహించాడు. సోమాచారిగారు దానిని ఆసక్తికరంగా కష్టపడి చదివి పూర్తి చేసేవాడు. కోర్టులో యివ్వవలసిన స్టేట్‌మెంట్ తయారు చేసినంత కాలం రోజూ ఉదయం ఇద్దరూ (టి.ఎన్; డి.వి.) కనీసం అరగంటసేపు చిన్నగా మాట్లాడుకొనేవారు. పేపర్ కటింగులు, రిఫరెన్సు బుక్స్ ఎక్సేంజ్ చేసుకొని ఇద్దరూ తమ రాత పనుల్లో మునిగిపోయేవారు.

నా పట్ల ఇద్దరూ అప్యాయంగా వుండేవారు. దాదాపు జైలులోని కామ్రేడ్స్ అందరూ నా పట్ల అలాగే వుండేవారు. బయట కమిటీ, జైలు కమిటీ మధ్య రాజకీయ విభేదాలతో జైలులోని కామ్రేడ్స్ రెండు సెక్షన్‌లుగా చీలిపోయినా, ఒకటే కమ్యూన్‌లో వుండేవారు. కమ్యూన్ నిర్వహణ, కొన్ని కుటుంబాలకు సాయం, కేసు డిఫెన్సు నిర్వహణ ఖర్చు భారం మొత్తం నాగిరెడ్డిగారి మీదనే పడింది.

నేను రాజమండ్రి, చింతపల్లి, విశాఖపట్నం జైళ్ళలో వున్న కాలంలో తీవ్రమైన నలత నుండి నన్ను బయట పడవేసి, బలం తెప్పించాలని నన్ను ప్రత్యేకంగా చూసేవారు. దేవులపల్లి వెంకటేశ్వరరావుగారు బెల్లంతో చేసిన వేరుశనగ ముద్దలను తెప్పించి డబ్బా నా చేతికిచ్చి ‘రోజుకొకటి నీ యిష్టమైనపుడు తిను, ఎవరికీ యివ్వకూడదని’ చెప్పాడు. జొన్నా కోటయ్యగారు, నెక్కలపూడి రామారావుగారలు కిచెన్ స్టోర్ ఇన్‌ఛార్జితో మాట్లాడి నాకు రెండు గుడ్లతో ఆమ్లెట్ వేయించి యిచ్చి బలం పెంచాలని చూశారు. విశాఖపట్నం జైలులో నిర్బంధాన్ని నిరసిస్తూ అక్కడ నిరాహార దీక్ష చేస్తున్న కామ్రేడ్స్‌కి సంఘీభావంగా నిరవధిక నిరాహార దీక్షలో నాగిరెడ్డిగారికి, నాకు పల్స్‌వీక్ అయింది. ప్రమాదమని డాక్టర్ చెప్పాడు. అంతలోనే బయట నుంచి వావిలాల తదితరుల జోక్యంతో విశాఖపట్నం జైలు సమస్యల పరిష్కారం కుదిరింది. నిరాహార దీక్ష విరమించాం. మాకు కోలుకోవడానికి అదనంగా పాలు, కోడిగ్రుడ్లు కేటాయించారు. నాగిరెడ్డిగారికి జైలులో చిన్న స్టవ్ అనుమతించారు. స్టేట్‌మెంట్ తయారు చేస్తున్న కాలంలో ఆయన అరగంట కొకసారి కాఫీ పెట్టుకొని త్రాగి చేసిన పరిశోధనా ఫలితమే, ‘తాకట్టులో భారతదేశం’. ఆయన మా యిద్దరి కోసం ప్రతిరోజు రాత్రి పుడ్డింగ్ చేసేవాడు. ఎన్ని గొడవలున్నా మొత్తానికి జైలులో కామ్రేడ్ల వాతావరణం నెలకొల్పబడి కొనసాగింది. నాగిరెడ్డిగారి సంయమన శక్తి, ద్వేషించేవారినైనా కలుపుకొని వెళ్ళే స్వభావం, వారి యిబ్బందులను గూడ పట్టించుకోనే విశాలత్వం, ఔదార్యం ఆ జైలు జీవితంలో నేను గమనించాను, స్ఫూర్తి పొందాను. నాగిరెడ్డిగారితో జ్ఞాపకాలు వ్రాయమంటే నా గురించి నేను వ్రాసుకోవడానికి కూడా అవకాశం దొరికింది. ఇది క్షమించదగిందేననుకుంటున్నాను.

**కోర్టు-కేసువిచారణ**

మెజిస్ట్రేట్ కోర్టులో విడుదలయినవారు విడుదలవగా మిగిలిన వారిపై సెషన్స్ జడ్జి కోర్టు ఏర్పరచి విచారణ మొదలు పెట్టారు. నాగిరెడ్డి, డి.వి. గారలు స్వంతంగా వాదించుకొన్నారు. మిగిలిన వారి తరపున ఎస్.వి.ఎల్. నరసింహంగారు, రావి సుబ్బారావుగారు,

ప్రత్తిపాటి వెంకటేశ్వర్లుగారు వకాల్తా వేశారు. కోర్టులో స్టేట్‌మెంట్‌లు చదువుతున్న సందర్భంలో చాగంటి శంకర్రావుని మా డిఫెన్స్ నుంచి తొలగించారు. మాదాల నారాయణ స్వామి, సోమాచారి ఇంకొందరు ఎస్.వి.ఎల్ గారి డిఫెన్స్‌ను వ్యతిరేకిస్తూ, డిఫెన్సును తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. ప్రత్తిపాటి వెంకటేశ్వర్లును వారి డిఫెన్సు లాయర్‌గా ప్రకటించారు. ఇది విప్లవకారుల మధ్య సమస్యలకు కారణమైంది. జైలులో ఇంకో బ్లాక్‌లోకి పంపబడిన వారిలో మా రాజకీయ విధానాల పట్ల గుడ్డి వ్యతిరేకత, ద్వేషం పెంచుకొన్న వారితో పాటు, ప్రభుత్వానికి అండర్‌టేకింగ్ ఇచ్చి అప్రూవర్స్‌గా మారిన వారు గూడా వున్నారు. కొల్లిపర పాండు రంగారావు నాకు స్నేహితుడే. లెక్చరర్‌గా మానుకొని పార్టీ పని చేయడానికి సిద్ధమై వచ్చినవాడు. మంథని ఏరియాలో బాధ్యత తీసుకొన్నాడు. ఆ పనిలో వున్నప్పుడే ఉద్విగ్న మానసిక స్థితికి గురయ్యాడు. చంద్ర పుల్లారెడ్డి పైన ద్వేషం, పగ పెంచుకొన్నాడు. అరెస్టయ్యాడు. ఆయన మానసిక స్థితిని పోలీసులు, మా రాజకీయ వ్యతిరేకులు బాగా ఉపయోగించుకొన్నారు. పుల్లారెడ్డిపై పగను నాగిరెడ్డి మీదకు మళ్లించారు. ఇక్కడ జరిగిన పరిణామాలను చిలువలు పలువలు చేసి తెలుగు వెలుగు పత్రికకు పంపించేదెవరో మా ముద్దాయిలలోనే వున్నారని అర్థమయింది. వారిని నాయకత్వం గుర్తించినప్పటికీ వారిపేర్లు మాకు బయట పెట్టలేదు.

హైదరాబాద్ కుట్రకేసు మెజస్ట్రేటు కోర్టులో విచారణ సందర్భంగా (1970 జూన్ లేక జూలై) "సాయుధ పోరాటాలు జరగకుండా ప్రజాస్వామిక పద్ధతుల్లో భూసంస్కరణలు అమలు జరపటమనేది అసంభవం" 'విప్లవాచరణకు ప్రత్యక్షంగా పిలుపు ఇవ్వకుండా భూస్వామ్య విధానం రద్దవుతుందనే నినాదం ఇవ్వటమంటే ప్రజలను మోసం చేయటమే అవుతుంద'ని కా॥నాగిరెడ్డి విస్పష్టంగా ప్రకటించారు. రెండు గంటలసేపు నిరాఘాటంగా సాగిన ఆయన ఉపన్యాసం "వర్గపోరాటమూ, ప్రజల సాయుధ విప్లవం ద్వారా పాలక వర్గాన్ని కూలద్రోయటం తప్పనిసరిగా జరుగుతాయ"నే వాక్యాలతో ముగించారు.

కామ్రేడ్ నాగిరెడ్డి, దేవులపల్లి తదితరులు ఎంతటి తీవ్రమైన శిక్షలకైన సిద్ధపడి పార్టీ విధానాలను సమర్ధించాలనే నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయంగా రీచ్‌స్టాగ్ కేసులో డిమిట్రావ్‌ను, జాతీయంగా మీరట్, కాన్పూర్ కుట్రకేసులో ఆనాటి కమ్యూనిస్టులను, ఇతర విప్లవకారులను ఆదర్శంగా తీసుకున్నారు.

మా మీద ఉన్న సెక్షన్‌లు తీవ్రమయినవి. "రాజ్యాన్ని కూలదోయడానికి కుట్ర పన్నామని, దానికోసం అనేక నేరాలు చేశామని" ప్రాసిక్యూషన్ నిరూపించబూనుకుంది. "మేము కుట్ర" పన్నలేదు అని నిరూపించుకోవాలి. కమ్యూనిస్టులు తమ ఆశయాలను, లక్ష్యాలను దాచుకోరనీ, అవి ప్రజల ముందుంచుతారనీ, ప్రజలు రాజ్యాధికారాన్ని సాధించుకుంటారనీ మా వాదన. దానికి ప్రజలను చైతన్యవంతులను చెయ్యడం నేరమనీ, ప్రజలు తమ హక్కులు తామే సాధించుకోవడం నేరమనీ ప్రభుత్వ వాదన. రాజ్యాధికారాన్ని సాధించుకొనడానికి ఫలానా మార్గంలోనే వుండాలని నిర్దేశించడం ప్రకృతి విరుద్ధమని మా వాదన. ప్రజాస్వామికంగా ఎన్నిక కావడం అంటే ఎన్నికలలో గెలిచిరావాలని ప్రభుత్వవాదన. అలా సాధ్యం కాకపోతే ఎలా వీలైతే అలా ప్రజలు అధికారంలోకి వస్తారు. ఎలా సాధ్యమయితే అలా వస్తారని వాదించడమే, దానికోసం ప్రజలను చైతన్యపరచడమే మా 'తక్షణ కార్యక్రమం'. ఇది కుట్రకాదు అని వాదించడానికి కామ్రేడ్ నాగిరెడ్డి పూనుకొన్నారు. ప్రభుత్వ విధానాలు అన్ని రంగాలలో ఇంత అధ్వాన్నంగా వుండగా దీనిని మార్చుకోమని ప్రజలను అడగడం నేరం కాదు. ప్రభుత్వాలను అడిగి అడిగి, ఇక అడగలేము మీరే సాధించుకోండని ప్రజలకు చెప్పడమే మా పని, మా బృహత్తర కార్యక్రమం. మాపై సాక్ష్యం చెప్పడానికొచ్చిన సాక్షులను మా లాయర్లు లీగల్ కోణాల నుంచి క్రాస్ చేస్తే, నాగిరెడ్డిగారు సామాజిక, రాజకీయ కోణాల నుంచి క్రాస్ చేసేవారు. కామ్రేడ్ డి.వి. గారు స్టేట్‌మెంట్ చదువుతూ భూమి సమస్య వివరిస్తున్న సందర్భంలో జడ్జిగారు ఉత్సుకతతో 'అధికారమిస్తే మీరు పంచగలరా' అని ప్రశ్నించారు. 'ప్రభుత్వం దగ్గరున్న ఆయుధాలు కొన్ని ప్రజలకివ్వమనండి భూకేంద్రీకరణ ఎలా బద్దలు కాదో చూద్దాం' అని అరసెకండ్ ఆలస్యం చెయ్యకుండా డి.వి.గారు సమాధానమిచ్చారు. కమ్యూనిస్టులు రాజకీయంగా కేసుని వాదించుకోవడమంటే కామ్రేడ్ టి.ఎన్, డి.వి.లు వాదించుకున్న తీరుని అర్థం చేసుకుంటే చాలు.

తూర్పుగోదావరి జిల్లాలో వందలాది ప్రజల మీద పెట్టబడిన 70 కేసులను మేము చేశామని చెబుతున్న కుట్రను రుజువు చేయడానికి ఆధారంగా ప్రాసిక్యూషన్ దాదాపు 50 మంది సాక్షులను తీసుకు వచ్చింది. ఇవన్నీ వ్యక్తులుగా నా మీద, శాంతిరాజు మీద వున్నాయి. కాని మా రాజకీయ విధానం దీనికి కారణమని ప్రాసిక్యూషన్ వాదించదలచుకొంది. కామ్రేడ్ దేవులపల్లి రూమ్‌లోకి నాగిరెడ్డిగారు నన్ను తీసుకెళ్ళి మా ఇద్దరి సమక్షంలో ఈ విషయాన్ని వివరించారు. డి.వి. గారు జాగ్రత్తగా చెప్పడం మొదలుపెట్టారు. 'ఈ విషయాలన్నీ మనం స్వంతం చేసుకోవాలి. ఇది మన రాజకీయ లైను యొక్క ఆచరణ రూపం' అన్నారు. 'దీనిని స్వంతం చేసుకుంటే పెద్దశిక్ష పడితే పడవచ్చు. కాని స్వంతం చేసుకోవడం అవసరం' అని చెప్పారు. వారు చెప్పినట్లే కోర్టులో నా స్టేట్‌మెంట్ సందర్భంగా ప్రతి కేసులో భూస్వాముల అక్రమాలు, భూములు కాజేసిన తీరుని చెప్పి, మాది తప్పు కాదు. ప్రజలు పూనుకొని సాగించిన కార్యక్రమం అని నేను స్వంతం చేసుకొన్నాను. కార్యకర్తలను రాటుదేల్చడం, శత్రువు కుట్రలను రాజకీయంగా ఎదుర్కోవడం అనే రాజకీయ, నిర్మాణ నిపుణతను మా నాయకులు ప్రదర్శించారు. మేము వారు పెట్టిన ఒరవడిని కొనసాగిస్తున్నాం. ఇంకా జారిపోలేదు. కామ్రేడ్ లెనిన్ నీలం నోట్‌బుక్‌లో చెప్పిన వాక్యాల ప్రకారం నేనీ మాట అంటున్నా. లెనిన్ యిలా అన్నాడు :

"కమ్యూనిస్టు తన అంతిమ ఘడియలలో ఆలోచించుకొని తాను కమ్యూనిస్టుగా జీవించానని తృప్తి చెందాలి. అంతకుముందు వరకు ఎన్ని పోరాటాలు చేసినా, త్యాగాలు చేసినా చివరలో జారిపోవచ్చు. కనుక చివరివరకు ఎలా వున్నాం? కమ్యూనిస్టు, కమ్యూనిస్టుగానే జీవించాడా? లేదా అని చూచుకొని అప్పుడే తృప్తి చెందాలి." ఇది లెనిన్ మాటల సారాంశం (నాకు యధాతథంగా కోట్ చేసే అవకాశం ప్రస్తుతం లేదు.)

కామ్రేడ్ టి.ఎన్. జైలు నుండి విడుదలైన నాటి నుండి ఎమర్జెన్సీ విధించేవరకూ ప్రజాతంత్ర హక్కుల కోసం, విప్లవకారుల లీగల్ డిఫెన్సుకేసు, శత్రు నిర్బంధంతో దెబ్బతిన్న ఉద్యమాల పునర్నిర్మాణం కోసం అహర్నిశలూ కృషిచేశారు. విప్లవ కార్యకర్తలను తయారు చేసుకోవటం, రైతు, కార్మిక, యువజన, సాహితీ, సాంస్కృతిక ఉద్యమాల నిర్మాణంకోసం అవిశ్రాంతంగా కృషిచేశారు. ఎమర్జెన్సీ విధింపుకు కొన్ని మాసాల ముందే ఎమర్జెన్సీ విధించబడే సూచనలున్నాయని కార్యకర్తల సమావేశాలలో హెచ్చరించారు. ఎమర్జెన్సీ పరిస్థితులలో సైతం ప్రజలనెలా కదలించవచ్చో, పాలకవర్గాల బూటకపు సంస్కరణల నాధారం చేసుకొనే; ప్రజలను భ్రమల నుండి బయట పడేయాలనే అవగాహననందించారు. ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యపైనా కరపత్రాల ద్వారా ఎండగట్టే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. తీవ్ర నిర్బంధ పరిస్థితులలో శత్రువుకి ఆచూకీ తెలియకుండా పంచే నైపుణ్యాన్ని సంపాదించాలన్నారు. కామ్రేడ్ నాగిరెడ్డి అవిశ్రాంత కృషి, శ్రమ ఆయన ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపాయి.

నాగిరెడ్డిగారు ఉద్యమం కోసం సర్వం వదులు కున్నారు. ఆయన సహచరి సహకారం తిరుగులేనిది. ఆయనతోపాటే నడిచింది. ఆయన విలువైన సాహిత్యాన్ని రక్షించింది. నాకు ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే 1960 దశకంలోని పేపర్ కటింగ్స్‌లన్నీ సచిత్ర వారపత్రికలలో అంటించి వున్నాయి. ఆమె వాటిని గూడా చాలా భద్రంగా వుంచి కోర్టు స్టేట్‌మెంట్ సందర్భంగా తెచ్చి యిచ్చింది. శ్రీకాకుళం, నల్లగొండ, వరంగల్, ఖమ్మం, రాయలసీమ జిల్లాల ప్రజలపై జరిగిన నిర్బంధ వార్తలు, పత్రికా రచయితల వ్యాఖ్యానాలు, ప్రభుత్వ వ్యాఖ్యానాలు, ఇంకా ఎన్నోరకాల విషయాల సమాహారంగా కటింగ్ ఫైల్స్ వుండడమే నా ఆశ్చర్యానికి కారణం. "కామ్రేడ్ చారీ ఇవిగో జ్ఞాపకం చేసుకోవడానికి" అని టి.ఎన్., కా॥ రామలింగాచారికి అవసరమైనవి ఇచ్చాడు.

సహచరి లక్ష్మీకాంతమ్మగారు, ఆయన బంధు మిత్రులు ఆయన సిగరెట్లు కాకుండా బీడీలు తాగుతున్నారని తెలిసి ఘాటు తక్కువ సిగరెట్లు పంపితే అవి కాల్చేవాడు కాదు. లక్ష్మీకాంతమ్మగారిని 'మోసం చేయడానికి' ఆమె ఇంటర్వ్యూకి వచ్చినపుడు మాత్రం అవి కాల్చుకొంటూ పెట్టె చేతిలో పట్టుకొని పకపక నవ్వుకుంటూ వెళ్లేవాడు.

ఆయన అమరుడయిన తర్వాత గూడా లక్ష్మీ కాంతమ్మగారు ఆయన సాహిత్యాన్ని భద్రపరిచే పవిత్రమైన కర్తవ్యాన్ని వదిలిపెట్టలేదు. ఆయనకు ప్రాణం అయిన వాటిని భవిష్యత్ తరాలవారు ఉపయోగించుకోవాలని ఆ సిరిని అన్ని భద్రతా ఏర్పాట్లుచేసి అప్పగించింది. ట్రస్టుగా కొన్ని వేల రూపాయలు జమ చేసింది. టి.ఎన్.ఎం. ట్రస్టు ఎంత గొప్ప ఆశయం, లక్ష్యంతో ఏర్పాటు చేయబడిందో అన్ని ఒడిదుడుకులకు గురయింది. అయినా తేరుకొని నిర్వహించుతూనే వున్నారు. ఆమె బ్రతికుంటే ఆమె పొందిన నిరాశ తొలగించుకొని ఎంతో సంతోషించి వుండేది. ఈ సందర్భంలో ఆమె పాత్రను మాకు తెలిసినంతవరకు పేర్కొనడం అవసరమని పేర్కొన్నాను.

**ఎమర్జెన్సీలో**

ఆంధ్రప్రదేశ్ కమిటీకి ఇన్‌చార్జిగా కా॥ టి.ఎన్. కమిటీ సమావేశాలకు హాజరయ్యేవారు. 20 అంశాల కార్యక్రమం ఎంత బూటకమైనదో వివరించే విస్తారమైన నోట్స్ తయారుచేసి ఒక యువ కామ్రేడ్‌కిచ్చి వ్యాసరూప మివ్వమన్నాడు. ఆ కామ్రేడ్ చక్కటి రూపమిచ్చాడు. సంస్కరణల పట్ల విప్లవకారుల వైఖరి ఎలా వుండాలో వివరించే బుక్‌లెట్‌తోపాటు, లెనిన్ సంస్కరణల యుగం వ్యాసాన్ని అచ్చు వేయించారు. లోతైన రాజకీయ విశ్లేషణ, సిద్ధాంత అవగాహన, పరిస్థితికి తగిన నిర్మాణ దృక్పథం, సంయమన శక్తిని ఎమర్జెన్సీలో ఆయన బ్రతికిన ఏడాది కాలంలో నేను సన్నిహితంగా అర్థం చేసుకొన్నాను. ఆయనను అంతకు ముందు విశాలమైనవాడిగా, కేవలం సౌమ్యుడిగా చూచిన నేను ఆయన లోతుని, కఠినత్వాన్ని చూశాను. శత్రువుపట్లనే కాదు, తనపట్ల తాను ఎంత కఠినంగా వ్యవహరించుకున్నాడో బాగా అవగతమైంది. ఆయనలో పైకి కనపడే సాదాసీదా తత్వం, ఆందోళనాతత్వం మాత్రమే చూచినవారు, వారి వైఖరిని సరిచేసుకోవాలి. కా॥ టి.ఎన్. తనను కష్టపెట్టు కున్నాడు, కుటుంబాన్ని కష్టపెట్టాడు, నిజాయితీ గల కామ్రేడ్స్‌ని కష్టపెట్టాడు. కఠినాత్ముడు నాగిరెడ్డి! దేనికోసం ఈ కాఠిన్యం? విప్లవం కోసమే. ఆయన్ను ద్వేషించవద్దు... ప్రేమించవద్దు... ఆయన్ని ఆచరించండి... ఇది నా విజ్ఞప్తి.

**(టి.ఎన్. మెమోరియల్ కమిటి ప్రచురించిన 'ప్రజాసేవలో తరిమెల నాగిరెడ్డి' పుస్తకంలో కా॥విశ్వం రాసిన వ్యాసమూ; 'తాకట్టులో భారతదేశం' గ్రంథంలో అనుబంధంగా మేఘనాధ్ పేరుతో కా॥విశ్వం రాసిన 'టి.ఎన్. జీవిత సంగ్రహం' ఆధారంగా రూపొందిన వ్యాసమిది)**

ooooo